


# కుముదిని

అపూర్వ జానపదగాథ

అనగనగా ఒకరాజు. ఆ రాజుకో కొడుకు. ఆ కొడుకుకి ఓ స్నేహితుడు. రాజుకొడుకైన శశివర్మ స్నేహితుడైన సోమశర్మతో యిలా అన్నాడు.

"దేశసంచారంచేసి దేశ పరిస్థితులు తెలుసుకోవాలని ఆత్రుతగావుంది సోమశర్మా."

"నాకీ కోరిక చిన్నప్పటినుంచీ వుంది యువరాజా! అవకాశంకోసం యింత కాలంనుంచీ యెదురుచూస్తున్నాను."

సోమశర్మ జవాబుకి శశివర్మ చాలా సంతోషించాడు. యిద్దరూ ఒక శుభదినమున ఉత్తుంగ తురంగరాల నధిరోహించి పశ్చిమాభిముఖులై ప్రయాణంసాగించారు. పోగాపోగా అరణ్య సదృశమైన ఓ నిర్జన ప్రదేశం తగిలింది. సూర్యుడు అస్తమించాడు. చీకట్లు గాఢంగా కమ్ముకుంటున్నై. దూరాన్ని అకస్మికంగా కాగడాల వెలుగు కనిపించింది. మనుషుల కేకలు వినిపించినై. రాజకుమారుడు సంభ్రమాశ్చర్యాలతో అటు తిరిగి "సోమశర్మా యీ నిర్జన ప్రదేశంలో యీ కలకలానికి కారణం ఏమిటి?" అన్నాడు.

"యీ ప్రదేశంలో దొంగలు ఎప్పుడూ తిరుగాడుతూ వుంటారు యువరాజా. యీ దారిని పోయే బాటసారులను దోచుకొని కట్టుగుడ్డలతో విడిచిపెడుతూ వుంటారు. మనంత్వరగా ఇక్కడినుంచి తప్పుకొనకపోతే చాలా ప్రమాదం." తొందరగా అన్నాడు సోమశర్మ.

"యీ ప్రదేశం మన రాజ్యభాగంలోదే కదా సోమశర్మా?"

"అవును యువరాజా."

"మనం లక్షలకొద్దీ సొమ్ము రక్షకభటుల కోసం ఖర్చుపెడుతున్నాం గదా! యింకా యీ దొంగల గుంపేమిటి? మన రక్షకభటు లేమిచేస్తున్నారు?"

"మనం రక్షకభటుల్ని పోషిస్తున్నది నిజానికి యీ దొంగలకోసంకాదు యువరాజా! రాజకీయరంగంలో—శాంతిభద్రతలను రక్షిస్తూ - ప్రస్తుత పాలకులకు ప్రమాదం జరగకుండా చూడడానికి. దీనినే రాజనీతిఅంటారు యువరాజా!" సోమశర్మ క్షణమాగి అటుచూసి "అదుగో! వాళ్ళు. వారు మనల్ని సమీపిస్తున్నారు. మనం సత్వరం యిక్కడినుండి వెళ్ళకపోతే ప్రమాదం!" అన్నాడు.

అప్పుడు యువరాజు రోషకషాయితనేత్రుడై, "ఏమన్నావ్ సోమశర్మా! యీ ముష్కరులకు జడిసి పారిపోవడమా? యింతకాలంనుండి నేను నేర్చుకొన్న అస్త్రవిద్యలను ప్రయోగించడానికి తగినఅవకాశం దొరికింది. యిదే! పోయి ఆ తస్కరులను చీల్చిచెండాడివస్తాను."అని నవరత్నఖచిత ఖడ్గాన్ని ఒరనుండి ఊడబెరికి ముందుకు అడుగు వేశాడు.

వెంటనే సోమశర్మ అతనిని పట్టుకొని "నీకేమైనా మతిపోయినదా యువరాజా? వందలకొద్దీ వున్న దొంగలతో కేవలం మనంయిద్దరం పోరాడ

అంగర సూర్యారావు

గలమా? ఇదేమైనా కాశీమజిలీ కథనుకున్నావా? యిప్పుడు మనం వాళ్ళతో పోట్లాడ్డానికిరాలేదు. దేశసంచారంకోసం వచ్చాం. యిదిగో ఈదారిని పోతే నిరపాయంగా గంటలో పట్నం చేరుకుంటాం" అన్నాడు.

గత్యంతరం లేనివాడై యువరాజు గుర్రాన్ని అటు అదలించాడు. యిద్దరూ గంటలో పట్నం చేరుకున్నారు: ఒక పూటకూటి యింటిలో ఆ రాత్రికి విడిదిచేశారు.

ఉదయం లేవగానే శశివర్మ "రాత్రి నాకో విచిత్రమైన కలవచ్చిందోయ్ సోమశర్మా!" అన్నాడు ఉల్లాసంగా.

"ఏమిటాకల?"

"ఓ అందమైన నవజవ్వని ఒయ్యారంగావచ్చి నా వడిలోకూర్చుంది."

"యవ్వనంలోఉన్న ప్రతి పురుషుడికి స్త్రీలు కలలోకిరావడం సహజం యువరాజా! దీనిగురించి నువ్వేమీ మనసు పాడుచేసుకోవద్దు."

"అంతేనా సోమశర్మా?" నిరుత్సాహంగా అన్నాడు శశివర్మ.

యిద్దరూ కాలకృత్యాలు తీర్చుకొని తిరిగి ప్రయాణోన్ముఖులయ్యారు. అప్పుడు సోమశర్మ శశివర్మతో యిలాఅన్నాడు:

"చూడుయువరాజా! యీ పట్నంతో మన రాజ్యపు సరిహద్దులు పూర్తిఅయినవి. యిప్పుడు మనం మరోరాజ్యంలో అడుగుపెట్టబోతున్నాం. ఆ దేశంలోని ప్రజలంతా సామ్యవాదులు, ఉద్రేకులు. చెట్లపైనుండి, గుట్టలపైనుండి కోతికొండముచ్చులయుద్ధం చెయ్యడంలో ఆరితేరినవారు. వాళ్ళు రాజుల్ని చూసినా, రాజరికపు వాదులను చూసినా చావగొట్టి వదిలిపెడతారు. అందువల్ల మనం యిప్పుడు వేషాలనుమార్చుకొని రైతులలా ఆ రాజ్యంలో కాలినడకను అడుగుపెట్టాలి. నేను మనగుర్రాలనుతీసుకువెళ్ళి గుఱ్ఱపుశాలకు అప్పగించి వస్తాను"

"యీ దేశపుపరిస్థితి చాలావింతగావున్నదే!" ఆశ్చర్యపోయాడు యువరాజు.

సోమశర్మ గుర్రాలను గుఱ్ఱపుశాలలో కట్టి వచ్చాడు. యిద్దరూ పంచెలు, తలపాగలుధరించి కృషీవలులలా తయారై పురోగమించారు.

"మనం రాజవంశానికి చెందినవాళ్ళమని పొరబాటునైనా వెల్లడించుకోకూడదు. ఇక ఇక్కడినుండి నిన్ను 'యువరాజా' అని పిలువను. శశిఅని పిలుస్తాను." హెచ్చరిక చేశాడు సోమశర్మ.

వసంతకాలపు కమ్మని తెమ్మెరలు ఆ బాటసారులకు స్వాగతాన్ని యిస్తున్నై. పళ్ళతో మామిడిచెట్లు కలకలలాడుతున్నై. తోటలచుట్టూ ముళ్ళకంచెలు నిర్మించబడివున్నై. ఆ ఫలపుష్పాలు సామాన్యులకు అందవు.—అందమైన ఆ దారిని నడిచినడిచి ఒకపల్లె చేరుకున్నారు. ఆ పల్లెలో ఒక యింటిముందు కోలాహలంగావుంది. పల్లెలోని జనమంతా అక్కడేఉన్నారు. శశివర్మ సోమశర్మా అక్కడకువెళ్ళి చూశారు.

రాజభటులు ఆ యింటిలోగల సమస్తం చింకిపంచెనుంచి చీపురువరకూ బయటపారేస్తున్నారు. ఆ యింటియజమాని పన్ను కట్టలేనందువల్ల అతని ఆస్తి వేలంవేస్తున్నారని శశి తెలుసుకున్నాడు. అతను సోమశర్మతో "డబ్బు లేనందువల్లనేకదా ఆ గృహస్థు పన్ను కట్టలేకపోయాడు. అటువంటప్పుడు డబ్బులేని ఆ దరిద్రుడినిగల చెంబూ ముంతాకూడా తీసుకుంటే యిక ఆ కుటుంబం ఏ రకంగా జీవించ గలుగుతుంది?" అన్నాడు జాలిగా.

"రాజశాసనానికి తిరుగులేదుశశీ! గృహస్థుమన్న యిపోయినా పన్ను కట్టితీరవలసిందే!" అని జవాబుచెప్పాడు సోమశర్మ.

ఆ పల్లెలో ఒకయింట్లో యిద్దరూ ఆతిథ్యం పొందారు. ఆరాత్రి భోజనలయిన తరవాత ఆ గృహస్థు అతిథులకు తమ దేశపరిస్థితులను కొన్ని ఈవిధంగా వివరించాడు. "ఈరాజ్యంలో కరువుకాటకాలు తాండవిస్తున్నై. పంటలుపండక పోయినా ప్రభుత్వానికి పన్ను చెల్లించితీరాలి. అసంఖ్యాకులయిన ప్రజాసామాన్యానికి తినడానికి తిండీ, కట్టుకోడానికి గుడ్డా, నివసించడానికి కొంపా లేవు. ప్రతిసంవత్సరం రకరకాల అంటువ్యాధులకు లక్షలకొద్దీ జనం బలైపోతున్నారు. రాజ్యంలో నూటికి పదిమందైనా అక్షరాస్యులు లేరు. ప్రజలలో అజ్ఞానాన్ని పెంపొందించడానికే ప్రభుత్వం పూనుకుంటుందిగాని విజ్ఞానాన్ని పెంపొందించాలన్న అభిప్రాయమైనా

దానికిలేదు. వైద్యవిద్యా సదుపాయాలను అభివృద్ధి చెయ్యడానికి బదులు ప్రజలనుంచి వసూలు చేసిన ధనంతో ప్రతిసంవత్సరం రక్షకదళాలను ప్రభుత్వం అభివృద్ధిచేస్తోంది. యీ మధ్య ఈ రాజ్యంలోని ఉపాధ్యాయులంతా జీతాలుచాలవని మొరపెట్టుకుంటే కొరడాలతో కొట్టారు. అన్నార్తులెవరైనా ఎదురుతిరిగి జవాబుచెబితే సామ్యవాదులనే పేరుతో ఎక్కడికో తీసుకుపోతున్నారు. యిక వాళ్ళఆచూకీ ఈ ప్రపంచంలో ఎవరికీ తెలీదు. యిదీ నాయనా! యీ దేశపు పరిస్థితి!"

"యీ రాజ్యపు స్థితిగతులు మాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నై. మీ రాజధానిలో కొద్దిరోజులువుండి అక్కడివిషయాలనుకూడా అవలోకించాలని మాకు కుతూహలంగావుంది" అన్నాడు శశి

"రాజధానిలో మా తమ్ముడు రామశాస్త్రి వున్నాడు. అతనికి ఉత్తరంరాసి యిస్తాను మీరు అతనియింట్లో కొద్దిరోజులు ఆతిథ్యంతీసుకోవచ్చు. అతను పరదేశస్థులను యెక్కువగా ఆదరిస్తూ వుంటాడు" అన్నాడా గృహస్థు.

యిద్దరు స్నేహితులూ ఆరాత్రి సుఖంగా నిద్రపోయారు.—దూరాన్ని కోకిలకూత వినిపిస్తోంది. తూర్పున అరుణరాగం కనిపిస్తోంది. యిద్దరూ నిద్రనుంచిలేచారు. ప్రకృతి మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది.ఎదురుగావున్న అందమైన భవనంలోంచి ఓ సుందరి బిందెపట్టుకొనివస్తోంది. ఆమెను చూడగానే శశివర్మ వివశుడై సోమవర్మతో యిలాఅన్నాడు. "చూడు సోమవర్మా! ఆమె ఎంత అందంగావుందో! వంపులుతిరిగిన పెదవులు—తీర్చి దిద్దినట్లు ముక్కు—ఎర్రటిచెక్కిళ్లు—సందేహంలేదు సోమశర్మా! యీమె మొన్న నాకు స్వప్నంలో కనిపించిన యువతి!"

"శశీ! నువ్వు కొంచెం ఒళ్ళు దగ్గరపెట్టుకొని ప్రవర్తించకపోతే యీ రాజ్యంలో మనమర్యాద దక్కదు. "ఒకవూరిరాజు మరోవూరిమాల" అన్న సామెత నువ్వు వినలేదా? ఆమె ఆ భవనంలో వున్న శిల్పికి చెల్లెలో భార్యో అయివుంటుంది. మనవ్యవహారం తెలిసిందంటే మనపీపు చిత్రీకట్టేస్తారు. కనక వేగంలేచి రాజధానికి బయలుదేరదాం నడు" అని ఉపదేశించాడు సోమశర్మ.

శశివర్మ గత్యంతరంలేనివాడై కాలకృత్యాలను తీర్చుకొని సోమశర్మతో రాజధానికి పయనమయ్యాడు.

రాజధానిలో అడుగుపెట్టగానే యిద్దరూ ఆశ్చర్యపోయారు. పెద్దతలపాగలు, చేతికర్రలు ధరించిన కొన్నివేలమంది దృఢకాయులు నినాదాలు చేస్తూ రాజవీధులలో తిరుగుతున్నారు. శశివర్మ వారిలో ఒకమనిషినిపిలిచి "ఏమిటిది?" అని అడిగాడు. "ఆకలియాత్ర!" అన్నాడా వ్యక్తి కర్కశంగా. అతను ధరించిన తలపాగ ఎర్రగా వుంది. పంచె ఎర్రగావుంది. చివరకు అతని కళ్ళు కూడా ఎర్రగా ఉన్నాయ్.

యిద్దరు మిత్రులు రాజధానిఅంతా గాలించి చివరకు రామశాస్త్రియిల్లు తెలుసుకున్నారు.

"మీరెవరు?" అన్నాడు రామశాస్త్రి.

"మేం దూరదేశానికి చెందిన కృషీవలులం. పుణ్యయాత్రా సందర్శనంకోసం బయలుదేరి ఇలా వచ్చాం. మీ అన్నగారు యిచ్చిన ఉత్తరం యిదిగో!" లేఖ యిస్తూ అన్నాడు సోమశర్మ.

జాబు చదువుకొని "మీరు యీ వూళ్లో వున్నంతకాలం మా యింట్లోనే వుండవచ్చు" అన్నాడు రామశాస్త్రి.

అతిథులకు అన్నిసదుపాయాలు చెయ్యబడినై. వీధివైపు పెద్దగది వారికి యివ్వబడినది. ఇక్కడి ప్రతి పరిస్థితి అతిథులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రోజూవందలకొద్దీయువతీయువకులు రామశాస్త్రి యింటికివచ్చి వెళుతున్నారు. యింట్లో రహస్య సమావేశాలు, చర్చలు జరుగుతున్నై. మొదటి రెండురోజులవరకూ మన బాటసారులకు ఇదంతా అయోమయంగా కనిపించింది. చివరకు రామశాస్త్రి రాజధానిలోని ప్రముఖోపాధ్యాయుడని వారు తెలుసుకోగలిగారు.

సాయంకాలం చల్లని పిల్లగాలులు మనసుకు ఉల్లాసాన్ని కలిగిస్తున్నై. వాహ్యాళికి వెళ్ళిన శశివర్మ సోమశర్మ బసచేరుకున్నారు. ద్వారంలో అడుగుపెట్టగానే శశివర్మకు మూర్ఛవచ్చినంత పని జరిగింది —అలిసిపోయినందువలన కాదు— లిన్నగా హాలులో ఓ లేజవ్వని నిలుచుని వుంది. ఆమె

శరీరం తెల్లగా మల్లెపువ్వులా వుంది. ముక్కు సూటిగావుంది. పెదవులు వంపుతిరిగి గంభీరతను సూచిస్తున్నై. ఆమె శశివైపు చురచురా చూసి వెళ్ళిపోయింది.

"ఎవరైతే మనకెందుకు శశీ! రా! మనపని మనం చూసుకుందాం" అన్నాడు సోమశర్మ.

అతని మాట వినిపించుకోకుండా శశి తన్మయుడై యిలా అన్నాడు: "తొలిచూపులో వలపు అన్న సిద్ధాంతంమీద నీకు నమ్మకంవుందా సోమశర్మా?"

"అది తప్పు సిద్ధాంతం. తొలిచూపులో వలపు కలిగితే అది మలుచూపులోనే విచ్ఛిన్నం కావచ్చు. కొద్దిరోజులు కలిసిమెలిసి తిరిగిన తరవాత-ఒకరినొకరు అర్థంచేసుకున్న తరవాత నిజమైన ప్రేమ జనించే అవకాశం వుంది."

"అసలు ప్రేమ అనేది వట్టిమాట కాయనా!" యిద్దరూ ఆశ్చర్యంతో వెనక్కు తిరిగి చూశారు. ద్వారంవద్ద రామశాస్త్రి నవ్వుతూ నిలుచుని వున్నాడు.

"ప్రేమ అనేదే లేదా?" ఆశ్చర్యంతో అడిగాడు శశి.

"మీరు అనుకుంటున్న ప్రేమ వట్టిది. స్త్రీ పురుషుల మధ్యగల గాఢమైన ఆకర్షణను మీరు ప్రేమ అనే తప్పుపేరుతో పిలుస్తారు. నిజమైన ప్రేమ స్త్రీపురుష భేదాలకు అతీతం. ఒక పురుషుడు మరొక పురుషుడిమీద ప్రేమ కలిగివుండవచ్చు. ఒక స్త్రీ మరొక స్త్రీమీద ప్రేమకలిగి వుండవచ్చు. పరస్పర ప్రేమ, సహనం మనలో ఏర్పడిననాడు మనజాతి ఉత్కృష్టతను పొందుతుంది."

రామశాస్త్రి లోనికి వెళ్ళిపోయాడు.

శశివర్మ సోమశర్మ గదిలోకి వెళ్ళి కూర్చున్నారు.

"నాకీ రామశాస్త్రివ్యవహారం చూస్తూవుంటే అనుమానంగా ఉంది. ఇతను సామ్యవాదిలా కనిపిస్తాడు" అన్నాడు సోమశర్మ.

"ఇతని గురించి ఏమైనా రహస్యాలు వుంటే నేర్పుగా రాబట్టాలి. రేపటినుంచి నువ్వు ఒంటరిగా వూళ్ళోతిరుగుతూ రామశాస్త్రిగురించి వివరాలు తెలుసుకోవాలి" అన్నాడు శశివర్మ.

"రామశాస్త్రిని చూడగానే నాకీ అభిప్రాయం కలిగింది" అన్నాడు సోమశర్మ.

"నా మనసును హరించిన ఆ యువతి ఎవరో కూడా తెలుసుకొని నాకు సహాయం చెయ్యాలి సోమశర్మా!" దీనంగా అడిగాడు శశి.

"ఈమె ఎవరో మధ్యతరగతి కుటుంబానికి చెందిన సామాన్యయువతిలా వుంది శశీ!"

"ఆమె ఎవరైతేనేం? ఆమెను చూశాక నా మనసు స్వాధీనంలో లేదు"

"దేశసంచారంకోసం వచ్చిన మనం ప్రేమ కలాపాలలో దిగడం మంచిది కాదు శశీ!" హెచ్చరించాడు సోమశర్మ.

"ఏమైనా సరే! ఆమెనుంచి నా మనసును మరల్చుకోలేను సోమశర్మా!" తన దృఢ నిశ్చయాన్ని తెలియజేశాడు శశివర్మ.

ప్రస్తుతం శశివర్మ హితబోధ వినే స్థితిలో లేడన్న విషయం తెలుసుకొన్నవాడై సోమశర్మ వూరుకున్నాడు.

మర్నాడు సోమశర్మ రహస్యాన్వేషణకోసం పట్నంలోకి వెళ్ళిపోయాడు. శశివర్మ ఒంటరిగా గదిలోకూర్చుని ఆలోచిస్తున్నాడు. యింతలో రామశాస్త్రి యువతితో కలిసి లోనికివచ్చాడు. ఆమెను చూడగానే శశివర్మ గొంతు తడి ఆరిపోయింది.

"యీమె నా శిష్యురాలు కుముదిని. మీరు మరోరాజ్యానికి చెందినవారని తెలుసుకొని మీ రాజ్యపు స్థితిగతులను తెలుసుకోవడానికి యీమె ఉత్సాహపడుతోంది. అదీకాక యీమెకు కృషీవలులంటే ఎక్కువ అభిమానం" అన్నాడు రామశాస్త్రి.

"రాజ్యపు పరిస్థితుల్ని గురించి చెప్పడానికి నాకూ సంతోషంగానేవుంది" రీవిగా అన్నాడు శశి.

"నాకు అత్యవసర కార్యాలు కొన్ని వున్నై. అది చూసుకొని వస్తాను. మీరు మాట్లాడుతూ వుండండి" అని రామశాస్త్రి బయటకు వెళ్ళిపోయాడు.

గదిలో కుముదిని శశివర్మ యిద్దరే మిగిలారు. శశివర్మ ఏదో మాట్లాడుదామనుకున్నాడు. అతని నోటినుండి మాటలు రావడంలేదు. తదేకదృష్టితో ఆమె ముఖంలోకి చూస్తున్నాడు.

"దెయ్యంపట్టిన మనిషిలా అలా చూస్తావేం? మీ రాజ్యంలో ఆడవాళ్ళు వుండరూ?" అంది కుముదిని తీక్షణంగా.

ఆమె మాటలధోరణికి నిర్విణ్ణుడై "వుంటారు. కాని యిలా మగవాళ్ళతో స్వేచ్ఛగా మాట్లాడరు" తడబడుతూ అన్నాడు శశి.

"అంటే మీది బాగా వెనకబడిన రాజ్యం అన్నమాట!" అందామె.

"వెనకబడడం అంటే?"

"నీ మాటల్ని బట్టిచూస్తే నీకేం రాజకీయ చైతన్యం ఉన్నట్లులేదు. నాతోరా! చెబుతాను" అని ఆమె ముందు నడుస్తోంది. ఆమె వెనుక శశి వర్మ నడుస్తున్నాడు. ఇద్దరూ కలిసి ఆ యింటిని ఆనుకునవున్న ఓ చిన్న ఉద్యానవనంలో ప్రవేశించారు. మామిడిచెట్టుకిందవున్న వేదికపై ఆమె కూర్చుని శశినికూడా ఆహ్వానించింది. సంశయిస్తూ చివరకు గత్యంతరంలేక శశి ఆమెప్రక్కను కూర్చున్నాడు.

"నీకు ఏవిషయంలోనైనా అన్యాయం జరిగిందనుకో! నువ్వు ముందుకువచ్చి దాన్ని ఎదిరించాలి. అప్పుడే నువ్వు చైతన్యవంతుడిగా గణింపబడతావు. అలాకాక అన్యాయాన్ని సహించి అదంతా కర్మ అని వూరుకుంటే నువ్వు వెనకబడిన మనిషికింద లెక్క."

ఆమె మాటలలో సంగీతం ధ్వనిస్తోంది. ఆమె చూపులలో లావణ్యం వర్షిస్తోంది. ఆమె ఉపన్యాసాన్ని అర్థంచేసుకునే స్థితిలోలేడు శశి. తామరతూడులా మృదువుగావున్న ఆమె చేతిని అమాంతంగా తన చేతిలోకి తీసుకున్నాడు. వెంటనే ఆమె చెయ్యి పైకిలేవడం——అతని చెంప చెళ్ళుమనడం-అతని తెల్లని చెక్కిలికి గులాబి రంగు రావడం - అన్నీ రెప్పపాటులో జరిగిపోయినై.

"రేపటినుంచి మర్యాదగా ప్రవర్తించడం నేర్చుకో!" జేవురించిన ముఖంతో ఆమె అక్కడినుంచి వెళ్ళిపోయింది.

అతనికి ముచ్చెమటలు పోశాయి. గుండె రెట్టింపువేగంతో కొట్టుకుంటోంది. ఆ చెట్టు క్రింద ఆ అవస్థలో అలా ఎంతసేపుకూర్చున్నాడో అతనికే తెలీదు.

"చీకట్లో ఒంటరిగా కూర్చున్నావేం శశీ?" యీ మాటలకు శశి బాహ్యప్రపంచంలోకి వచ్చి తిరిగి చూశాడు. సోమశర్మ నిలుచునివున్నాడు. అతన్ని చూడగానే శశికిప్రాణాలు లేచివచ్చాయి.

"గొప్ప ప్రమాదం జరిగిపోయింది సోమశర్మా!" ఆత్రుతతో అన్నాడు.

"ఏమిటా ప్రమాదం?"

"కుముదినికి నా ప్రేమ తెలియజేశాను. వెంటనే ఆమె కోపంతో వెళ్ళిపోయింది."

"పోతే పోనియ్యి. అందులో ప్రమాదమేముంది?" "వట్టినే పోలేదోయ్. చెయ్యి చేసుకొని మరీ పోయింది."

"ఆడవాళ్ళచేత దెబ్బలు తినడం రాజవంశానికి అనాదినుంచీ వస్తున్న ఆచారం. దీనికి పురాణ ప్రమాణాలుకూడా వున్నాయ్. కనక నువ్వేం బాధ పడవలసిన అవసరంలేదు శశీ!"

"వాళ్ళవాళ్ళతో చెప్పి ఏం గొడవతెస్తుందో అని భయంగావుంది."

"నీకు యింకా ఆడవాళ్ళ మనస్తత్వం తెలీదు శశీ! వెంటనే మన ప్రేమగురించి తెలియజేస్తే కొంప మునిగిపోయిందన్న మాటే! తొందరపడకుండా నేర్పుగా ప్రవర్తించాలి. ఇక యీ విషయం ఆమె ఎవరికైనా చెబుతుందేమోనని నువ్వు భయపడనక్కరలేదు. ఆమె ఏ పరిస్థితులలోనూ ఎవరికీ చెప్పదు. కనక నిశ్చింతగా లోపలికి రా! రామశాస్త్రి రహస్యాలు కొన్ని తెలుసుకు వచ్చాను-చెబుతాను." ఇద్దరూకలిసి లోనికి వెళ్ళిపోయారు.

"ఈ రాజ్యంలో సామ్యవాదుల ప్రాబల్యం హెచ్చని నీకు యిదివరకే చెప్పాను. కొత్తలో సామ్యవాది అనేవాడు కనిపించగానే ఉరితీసేవారట. రానురాను వాళ్ళ సంఖ్య రాజ్యంలో పెరగడంతో ప్రస్తుత ప్రభుత్వం గత్యంతరం లేక వూరుకొంటదట. ఈ రామశాస్త్రి శుద్ధ సామ్యవాది. ఈ రహస్యం రాజుగారిక తెలియక ఇతనిని ఆస్థానోపాధ్యాయుడిగా నియమించారు" అన్నాడు సోమశర్మ.

"అదంతా మనకెందుకు కానీ కుముదినిగురించి వివరాలు తెలుసుకొని నాకు చెప్పాలి!" అన్నాడు శశి.

"ఆమె సామ్యవాదిని అని నిశ్చంశయంగా మనకు తెలుస్తోంది. ధనవంతులు ఎప్పుడూ సామ్యవాదులు కారు గనక ఆమె తప్పకుండా ఏ పేదరైతు కూతురో అయివుంటుంది. ఇక అన్నిటికీ యిష్టపడి నువ్వు యీామెనే ప్రేమించి పెళ్ళాడితే—యిటువంటి సామ్యవాదినిని పెళ్ళి చేసుకున్నందుకు మీ నాన్నగారు నీకు రాజ్యం యివ్వరు సరికదా—నిన్ను యింట్లో అడుగు కూడా పెట్టనివ్వరు. కనక నామాట విని ప్రణయ కలాపంనుంచి తప్పుకో!" అని సలహా యిచ్చాడు సోమశర్మ.

"ఏమన్నావ్ సోమశర్మా! తుచ్ఛమైన రాజ్యం కోసం సహజమైన నా కోరికను చంపుకోమంటావా? ఎంతమాత్రం వీల్లేదు!" కోపంతో శశి కళ్లు ఎర్రబడ్డాయి.

రాగం శ్రుతిమించినదని తెలిసి సోమశర్మ మౌనం వహించాడు.

మర్నాటి సాయింత్రం రహస్యాన్వేషణకై సోమశర్మ వూళ్ళోకి వెళ్ళినప్పుడు—సంధ్యా సమీరాలు మనసుకు ఆహ్లాదాన్నిస్తున్నప్పుడు కోకిల కూజితం వినిపిస్తున్నప్పుడు ఆమె తిరిగి కనిపించింది. కూడా ఎవర్నీ తీసుకురాలేదు కదా! భయంతో పరికించి చూశాడు శశి.

"అలా చూస్తావేం? లేచి బయటకు రా!" అంది ఆమె తీక్షణంగా.

ఆమె ప్రవర్తనా, ఆజ్ఞాపించే ధోరణిచూస్తే శశివర్మకు వళ్లు మండింది. కాని గత్యంతరం లేనివాడై ఆమె వెనుక వెళ్ళాడు. తిరిగి యిద్దరూ మామిడిచెట్టుకింద కూర్చున్నారు.

"నీపేరేమిటన్నావు?"

"శశి!"

"చాలా బాగుంది నీపేరు. నిన్నటిదెబ్బవల్ల నీకేమైనా గుణం కనిపించిందా లేదా?"

"చాలాగుణం కనిపించింది."

"ఏమిటది?"

"రాత్రంతా కలలో నువ్వేకనిపించావ్!" అని శశివర్మ ఆమెముఖంలోకి చూశాడు.

"నిన్న నీమీద నాచేయిపడినప్పటినుంచీ నాకు ఆదోలావుంది. నిన్నటినుంచీ నీగురించే ఆలోచిస్తున్నాను — చూడు శశీ! నిన్నొకమాట అడుగుతాను. నిజంచెబుతావా?" అంది అతని కళ్ళలోకిచూస్తూ.

"ఏమిటి?"

"నేను నీతో మీరాజ్యం వస్తే నీకేమైనా అభ్యంతరం వుంటుందా?"

"ఏమిటి కుముదినీ? నువ్వునాతో మారాజ్యం వస్తావా? నిజమా? హాస్యమా?" ఆశ్చర్యంతో అడిగాడు శశి.

"నిజమే."

"మీ వాళ్ళకు తెలిస్తే వూరుకుంటారా?"

"నేను ఎవరినను కుంటున్నావ్?"

"ఎవరో పేదరైతు కూతురువై వుంటావని సోమశర్మ చెప్పాడు."

అతని జవాబుకు కుముదిని నవ్వి యిలాఅంది.

"కాదు. నేనెవరినో రహస్యంగా చెబుతాను. దగ్గరకురా!" అతను ఆమెకు మరింత దగ్గరగా జరిగాడు.

"నేను యీ రాజాన్ని పాలిస్తున్న సుందర వర్మ కూతుర్ని. మా గురుదేవులైన రామశాస్త్రి గారి దయవలన ప్రపంచంలోని తారతమ్యాలను తెలుసుకున్నాను. నిరుపేదలంటే నాకెంతో అభిమానం. నువ్వు కృషీవలకుమారుడివని తెలిసి నిన్ను ప్రేమించాను. అలాకాక నువ్వు ఏ రాజు కుమారుడివైనా అయివుంటే నిన్ను చెట్టుకు కట్టించి కొరడాలతో కొట్టించి వుండేదాన్ని" అంది గంభీరంగా.

ఈ మాటలకు భయంతో శశిగుండెలు కొట్టుకున్నై. అతని ముఖం పాలిపోయింది.

"ఏం? అలా తెల్లబోతా వెందుకు?" అతని చేతిని తనచేతిలోకి తీసుకుంటూ ఆప్యాయంగా అడిగింది.

"నువ్వు మహారాజు కూతురివైయుండీ నా వంటి నిరుపేదను ప్రేమిస్తున్నందుకు నాకుచాలా ఆశ్చర్యంగావుంది"

"నీ చేతులు ఎంత మృదువుగా వున్నాయిశశీ! నువ్వు ధనవంతుడవు కావుగదా?" సంశయిస్తూ అడిగింది.

"ఊహుఁ! నేను మా నాన్నకు ఏకైకపుత్రుడను. అందువల్ల నన్ను మానాన్న నాగలికూడా పట్టుకోనిచ్చేవాడు కాదు."

"నువ్వెంత అందంగావున్నావు! ముఖంమీద పడే నల్లని ఉంగరాలజుత్తు — విశాలమైనకళ్ళు-వంపులుతిరిగిన పెదవులు- నిన్ను చూసిన మొదటి చూపులోనే నువ్వు నాదృష్టి నాకర్షించావు శశీ"

"నా మనసును నీనుంచి మళ్ళించుకోలేనని నిన్ను చూసినవెంటనే సోమశర్మకు చెప్పాను."

యింకా ఆ ప్రేయసీ ప్రియులు ఏవేవో మాట్లాడుకుంటున్నారు. ప్రేమకు కొంచెం మోతాదు హెచ్చినతరవాత ప్రేమికులు మాట్లాడుకునే మాటలకు అర్థం వుండదు——సూర్యుడు అస్తమించాడు. పంచమీ చంద్రుడు నవ్వుతున్నాడు. పక్షుల కలకలారవం వినిపిస్తోంది. కుముదినీ శశివర్మలు బాహ్యప్రపంచాన్ని గుర్తించడంలేదు.

"శశీ! చాలా ఆలస్యమయ్యింది. యికరా!" పిలుపుతో యిద్దరూ బాహ్యప్రపంచంలోకి వచ్చారు.

"ఎవరది?" అంది తీక్షణంగా కుముదిని.

"నా స్నేహితుడు సోమశర్మ." అన్నాడుశశి.

"రేపు ప్రయాణానికి నువ్వు సిద్ధమైవుండాలి. యిక ఎంతమాత్రం ఆలస్యం అవడానికి వీల్లేదు," అని కుముదిని వెళ్ళిపోయింది.

"అనురాగం శ్రుతిమించినట్లుందే!" అన్నాడు సోమశర్మ.

"అన్నీ కలిసివచ్చాయి. యిక ప్రయాణం రేపే!" ఆనందంతో అన్నాడుశశి.

"ప్రయాణం ఏమిటి శశి? నీ వ్యవహారం చూస్తూవుంటే ఏదో ప్రాణంమీదికి తెచ్చేలా వున్నావు." సంశయిస్తూ అన్నాడు సోమశర్మ.

"నువ్వు వయసులో యువకుడివైనా బుద్ధిలో శుద్ధముసలాడివి సోమశర్మా! నీకు కొంచెంకూడా అభ్యుదయభావాలులేవు" అన్నాడు కోపంతో శశి.

"ఓహో! నీకప్పుడే సామ్యవాదులగాలి సోకినట్లుందే!"

"యిదిగో సోమశర్మా! యికనువ్వు ఎన్ని చెప్పినా మా నిశ్చయానికి తిరుగులేదు. మేంరేపే మనరాజ్యం వెళ్ళిపోవడానికి నిశ్చయించాం. ఆమె ఎప్పటిలా రేపటిసాయంత్రం పల్లకిలో యిక్కడకు వస్తుంది. నేనుకూడా ఆ పల్లకి ఎక్కుతాను. ఆ పల్లకి బోయీలుకూడా సామ్యవాదులయినందువల్ల ఆమెమాటకు ఎదురుచెప్పరు. మేం పల్లకిలో పట్నందాటేసరికి నువ్వు పొలిమేరలో సిద్ధంగా వుండాలి. అక్కడినుంచి ముగ్గురం కలిసి మనరాజ్యం పోదాం" దృఢనిశ్చయంతో అన్నాడు శశి.

"యింతకూ ఆమెఎవరో తెలుసుకున్నావా?"

"తెలుసుకున్నాను. ఆమె యీ రాజ్యాన్ని పాలించే సుందరవర్మకూతురు."

యీ జవాబు వినేసరికి సోమశర్మకు గుండె ఆగినంతపని జరిగింది. అతను భయంతో యిలా అన్నాడు. "చూడగా చూడగా నీకు మతిచలించినట్లు కనిపిస్తోంది శశీ! సుందరవర్మ ఎంతకర్కోటకుడు! వాడి కూతుర్ని నువ్వు దొంగతనంగా ఎత్తుకుపోతే వాడు వూరుకుంటాడా? మనం మన రాజ్యంవెళ్ళి మీ నాన్నగారితో చెబితే ఆయనే యీ పెళ్ళి కుదురుస్తాడు. సుందరవర్మ సంతోషంతో నీకు తనకూతుర్నిచ్చి వివాహం చేస్తాడు. అంతేగాని గోరుతో పోయేదానికి గొడ్డల్ని వుపయోగించడం మంచిదికాదు శశీ!"

శశివర్మకళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి.

"నువ్వు ఎప్పుడూ ఏదో అడ్డుచెబుతూనే వుంటావు. యీసారి నువ్వేం చెప్పినా లాభం లేదు. ఉత్తమ రాజవంశానికి చెందిన నేను—— ధైర్య సాహసాలను ప్రదర్శించడానికి కలిగిన యీ అవకాశాన్ని వృథాగా విడిచిపెట్టను. నువ్వు మారు మాటాడకుండా నేను చెప్పినట్లు చెయ్యి." కర్కశంగా అన్నాడు శశి.

గత్యంతరంలేక వూరుకున్నాడు సోమశర్మ.

మర్నాటి సాయంత్రం సోమశర్మ పట్నం పొలిమేరలో కుముదినీ శశివర్మలరాకకెదురు చూస్తూ కూర్చున్నాడు.

యిక్కడ——సమయానికి కుముదిని పల్లకిలో వచ్చింది. చీకటి పడేవరకూ కుముదినీ శశివర్మలు మామిడిచెట్టుకింద మాట్లాడుతూ కూర్చున్నారు. వాళ్ళముఖాలలో ఆనందం తాండవిస్తోంది. చీకటి పడగానే యిద్దరూ పల్లకిఎక్కి కూర్చున్నారు. కుముదిని పల్లకితెరలను సరిగా సర్దింది. లోపల ఎవరు వున్నారో ఎవరికీ తెలీదు. పల్లకి చురుకుగా ముందుకు పోతోంది. యిక పట్నందాటడానికి

కొన్ని గజాల దూరంవుంది. యింతలో భూమ్యా కాశాలు దద్దరిల్లేటట్లు వందలకొద్దీ సైనికులు గుర్రాలమీదవచ్చి పల్లకిని ముట్టడించారు. పల్లకిని తిరిగి కోటవైపు నడిపించారు. పరస్పర బాహు బంధాలలో బంధింపబడవలసిన ప్రేయసీ ప్రియుం లలో ప్రేయసి అంతఃపురంలోను- ప్రియుడు చెర సాలలోను బంధింపబడ్డారు. యీవార్త తెలిసిన సోమశర్మ-వెనక్కి తిరిగిచూడకుండా తన రాజ్యం లోకి పారిపోయాడు. దీనితో కథ ఆగిపోయింది.

కుముదినీ శశివర్మల ప్రేమ ఫలించినదా? పారిపోయిన సోమశర్మ తనరాజుతో చెప్పి సైన్య సమేతంగా యీ రాజ్యాల మీదికి యుద్ధానికి వస్తాడా?

యుద్ధంలో సుందరవర్మను ఓడించి శశివర్మను విడిపిస్తాడా? శశివర్మ కృషీవల కుమారుడుకాక రాజకుమారుడని తెలిసిన తరవాత కుముదినిప్రేమ యింకా అతనిమీద నిలుస్తుందా?

కుముదినీ శశివర్మలప్రేమ గాఢంగా నిలిచినా సామ్యవాదినిని తనకొడుకునకు వివాహం చెయ్య డానికి శశివర్మతండ్రి అంగీకరిస్తాడా?

కుముదినీ శశివర్మల ప్రేమ నిలిచి - శశివర్మ తండ్రి యీ పెళ్ళికి అంగీకరించి- చివరకు యిద్దరి ప్రేమా ఫలించి - యిద్దరూ ఆ రాజ్యానికి రాజు రాణీ అయిన తరవాత వారు తమ పదవులను రద్దుపరచుకొని ఆ రాజ్యంలో సామ్యవాద సిద్ధాం తాలను ప్రవేశపెడతారా?

ఈ సందేహాలన్నిటికీ సమాధానాలు మీరే వూహించండి.

---

స్కెచ్

# "శిరసి మాలిఖ"

ఇచ్ఛాపురపు జగన్నాధరావు

"ఈ ఇంటివారెవరండి!"

"ఎవరూ?"

"ఈ ఇంటివారు—సొంతదారులు..."

"అది సరేలెండి—మీ రెవరూ అనీ అడ గడం..."

"నే నెవరినని చెప్పకోను లెండి! అయినా మీరేనా ఇంటివారూ?"

"కాకపోతే మీరెవరో చెప్పరా ఏం?"

"ఎందుకు చెప్పాలో నా కర్థం కావడంలేదు"

"గౌరవంగా ఎవరని అడిగితే ఇంత అర్థాలూ తెలియకపోడాలూ ఎందుకో! పాడుకాలం—"

"నా ఒక్కణ్ణి గురించి కాలాల నన్నిటినీ తిట్టేడం ఎందుకులెండి గాని, ఈ ఇంటివారు ఎవరూ?"

"తెలీక అడుగుతానూ - వారంటు ఏమైనా తెచ్చావా నాయినా?"

"వారంట్లు తెచ్చే ఉద్యోగం దొరకలేదుగానీ, అసలా సందేహం ఎందుకు వచ్చింది దొడ్డమ్మ గారూ?"

"అహా...అసలు నువ్వు ఇంటివారిని ఏ జన్మలోనైనా చూశావా అని—"

"ఈ ఇంటివారిని నిజంగా చూడలేదు లెండి"

"పోనీ-ఏ ఇంటివారినైనా—"

"చాలామందిని చూసేను"

"అదిగో! అచ్చు అలాగే అంటూఉండేవాడు మా రెండోపిల్ల సవితి తమ్ముడు మేనమామ... నలభై ఏళ్లు నిండాయో లేదో—గుటుక్కు మన్నాడు...పాపం. ఆపిల్ల అదృష్టం."

"దురదృష్టం అనండి."

"ఎందుకనాలీ? బ్రతికున్నన్నాళ్లు కాల్చుకుని తిన్నాడు."

"పోనీండి...ఆవిడ అదృష్టవంతురాలు."

"అదృష్టం!...నువ్వెవరోగానీ, నువ్వే అనాలి. అయిదురు పిల్లల్నీ దాన్నీ లోకానికి వప్పజెప్పి హరీమని ఊరుకున్నాడు."

"ఎంతకష్టం!"

"అదేం మాటయ్యా! సాలీనా పదేనువొంద లొచ్చేభూములూ పదివేల ఇంసురెంసూ...అన్నీ